సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 11 । జూలై । 2023



ప్రభం'జనం' ఆపుదాం.. 8లో▸

పెరుగుతున్న జనాభాతో దుష్పరిణామాలు తప్పట్లేదు. ఈమేరకు ప్రజలకు అవగాహన కలిపించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఆర్ఐపై కమిషనర్‌కు ఫిర్యాదు

కైలాస్‌నగర్: మ్యూటేషన్ల కోసం మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపిస్తూ పట్టణంలోని 13వ వార్డు తిరుమలనగర్ వాసులు కమిషనర్ శైలజకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కమిషనర్ స్పందిస్తూ రెండు రోజుల్లో మ్యుటేషన్లు పూర్తి చేయడంతో పాటు బాధ్యుడైన ఆర్ఐపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు కొప్పుల దేవిదాస్ తదితరులు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/26.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రిమ్స్‌లో వసతులు కల్పించాలని వినతి



సమావేశంలో పాల్గొన్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పీజీ మెడికల్ విద్యార్థులకు మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ కోరారు. ఈ మేరకు ఢిల్లీలోని నిర్మాణ్ భవన్‌లో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. రిమ్స్‌లో ఉన్న వసతులు, పీజీ సీట్లు, తదితర సౌకర్యాల వివరాలను హెల్త్ సర్వీస్ డైరెక్టర్ అతుల్ గోయల్‌కు వివరించారు. మౌలిక వసతుల కల్పన కోసం నిధులు విడుదల చేయాలని కోరారు. ఇందులో రాష్ట్రంలోని వివిధ మెడికల్ కళాశాలల డైరెక్టర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. పట్టణంలోని హమాలీవాడ, తాటిగూడ పాఠశాలలను సోమవారం సందర్శించారు. ఈ నెల 15వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులతో పఠనం చేయించాలన్నారు. దాతల సహకారంతో పుస్తకాలు సమకూర్చుకోవాలని సూచించారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన అమలు తీరు, తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు.

ఓటు వినియోగంపై ప్రత్యక్ష అవగాహన

కైలాస్‌నగర్: ఓటు వినియోగంపై ప్రతీ పోలింగ్ కేంద్ర పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున కేటాయించిన రెండు శిక్షణ, ప్రచార రథాలను కలెక్టరేట్ సమావేశ మందిరం వద్ద సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఓటర్లకు ఈవీఎం, వీవీప్యాట్‌ల వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రచార రథంలో నాయబ్ తహసీల్దార్, పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని చెప్పారు. ప్రతీ ఓటరు https:// www. nvsp. in పోర్టల్‌లో ఎపిక్ నంబర్ ఎంటర్ చేసి వారి వివరాలు పరిశీలించుకోవాలని సూచించారు. ఒక వేళ తొలగించబడినట్లైతే ఫారం–6 నింపి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కాగా ఓటు వినియోగంపై అవగాహన కల్పించేలా సమావేశ మందిరం వద్ద ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశా రు. ప్రజావాణికి హాజరైన అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, ఆర్డీవో రమేశ్ రాథోడ్, జెడ్పీ సీఈవో గణపతి, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ తదతరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల తనిఖీ




కార్డుదారులతో మాట్లాడుతున్న డీఎస్‌వో కిరణ్‌కుమార్

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ అర్బన్ మండలంలోని పలు రేషన్ షాపులను డీఎస్‌వో టి.కిరణ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. పట్టణంలోని గాంధీనగర్, ఖుర్షీద్‌నగర్, మహాలక్ష్మీవాడ, రణదీవేనగర్ కాలనీల్లోని ఆయా దుకాణాలను తనిఖీ చేసిన ఆయన స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి సకాలంలో బియ్యం వస్తున్నాయా.. అనే వివరాలపై ఆరా తీశారు. కార్డుదారులతో మాట్లాడి నిర్ణీత సమయంలో బియ్యం పంపిణీ చేస్తున్నారా, తీసుకున్న బియ్యం తింటున్నారా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోషకాలతో కూడిన బియ్యంను పడేయకుండా వండుకొని తినాలని సూచించారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబూసింగ్ ఉన్నారు.

పంట లెక్క.. పక్కా

- క్రాప్ బుకింగ్‌లో కొత్త విధానం
- ఏఈవో యాప్‌లోనే న్యూ మాడ్యుల్
- క్షేత్రస్థాయికి వెళ్తేనే సర్వే నంబర్లు ఓపెన్
- నమోదు పూర్తయితేనే రంగు చేంజ్



ఏఈవో యాప్



కప్పర్లలో క్రాప్ బుకింగ్ కొత్త విధానంపై పరిశీలన చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సాక్షి,ఆదిలాబాద్: క్రాప్ బుకింగ్‌లో ప్రభుత్వం నూతన విధానం తీసుకువచ్చింది. ఇందుకోసం ఏఈవో యాప్‌లో కొత్త మాడ్యూల్ ఏర్పాటు చేసింది. దీంతో పంట లెక్క ఇకపక్కాగా తేలనుంది. రాష్ట్రంలో ప్రతీ జిల్లాలో ఒక మండలం పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంటుండగా, ఆదిలాబాద్ జిల్లాలో మావలను ఎంపిక చేసింది. ప్రస్తుతం ట్రయల్ రన్ షురూ చేసింది.

గతంలో ఇలా..

ఓ గ్రామానికి వెళ్లిన వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) ఆయా సర్వేనంబర్లలో ఏయే పంటలు రైతులు సాగు చేశారనేది నమోదు చేసి వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలి. అయితే ఈ పక్కనుంచి ఆ పక్క వరకు కనుచూపు మేర ఒకటే పంట కనిపిస్తుండడంతో రైతులు అదే పంట ఎక్కువ స్థాయిలో పండించారని నామమాత్రంగా నమోదు చేసేవారు. దీంట్లో పంట ఖచ్చితత్వం అనేది ఉండదు. తద్వారా ప్రభుత్వానికి ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయనే విషయంలో పూర్తిస్థాయిలో స్పష్టత ఉండేది కాదు.

ఇప్పుడొక లెక్క..

క్రాప్ బుకింగ్ ఇప్పటివరకు ఒక లెక్క.. ఇప్పుడొక లెక్క. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే గ్రామ పెద్దనో.. బడా రైతునో అడిగి ఆయా సర్వే నంబర్లలో ఏయే పంటలు వేశారనేది ఇప్పటివరకు నమోదు చేస్తూ వచ్చారు. ఇప్పుడిక ఆ ఆటలు సాగవన్నట్టు ప్రభుత్వం యాప్‌లో కొత్త మాడ్యుల్ తీసుకొచ్చింది. ఇందులో తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్తేనే ఆ వివరాలు నమోదు చేసుకునే విధంగా ఉండడంతో ఏఈవోలు పొలం బాట పట్టాల్సిన పరిస్థితి. ప్రస్తుతం జిల్లాలోనే కాకుండా రాష్ట్రం మొత్తంగా ఈ విధానంపై ట్రయల్ రన్ కొనసాగుతుంది. ఇందులో ఎదురయ్యే లోటుపాట్లు సవరించుకున్న తర్వాత త్వరలోనే దీన్ని అమలు పర్చనున్నారు.

రంగులు మారుతాయి..

జిల్లాలో 101 క్లస్టర్లకు ఏఈవోలు ఉన్నారు. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ఉండగా, కొన్నింటిలో అంతకు మించి గానీ, తక్కువ కూడా ఉన్నాయి. కొత్త యాప్‌లో సర్వే నంబర్లన్నీ ఎరుపు రంగులో దర్శనమిస్తాయి. ఏఈవోలు ఒక సర్వే నంబర్‌కు వెళ్లినప్పుడు అందులో మూడు పట్టా భూములు ఉంటే రెండు పట్టా భూముల వివరాలు నమోదు చేసిన పక్షంలో ఆ సర్వే నంబర్‌లో క్రాప్ బుకింగ్ పాక్షికంగా పూర్తయినట్టు. ఆ సర్వే నంబర్ రంగు ఎరుపు నుంచి పసుపుకు మారుతుంది. ఒకవేళ వందశాతం ఆ సర్వే నంబర్లలో క్రాప్ బుకింగ్ పూర్తయితే ఆకుపచ్చ రంగులోకి మారిపోతుంది. తద్వారా అక్కడ పంట నమోదు పూర్తిస్థాయిలో జరిగిందని అర్థం. ఇలా కొత్త విధానం ప్రస్తుతం ప్రయోగాత్మ దశలో ఉంది. దీనికి సంబంధించి తాంసి మండలం కప్పర్లలో వ్యవసాయ అధికారులు సోమవారం ప్రయోగాత్మకంగా అమలు చేసి చూశారు. దీని లోటుపాట్లను ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఆ తర్వాత పూర్తి స్థాయిలో జిల్లా వ్యాప్తంగా అమలుపర్చనున్నారు.

జియోఫెన్స్..

ఏఈవోలకు యాక్టీవ్ లాగర్ యాప్ ఇదివరకు నుంచి ట్యాబ్‌లలో ఉపయోగిస్తున్నదే. దీంట్లోనే వారు అటెండెన్స్‌తో పాటు రోజువారి విధులకు సంబంధించి రైతు బీమా, రైతుబంధు అప్‌డేట్ నమోదు చేసి పంపించేవారు. ఇందులోనే క్రాప్ బుకింగ్ కూడా చేపట్టేవారు. అయితే ఇది క్షేత్రస్థాయి వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఏఈవోలు వివరాలు నమోదు చేసే విధంగా ఉంది. ఈ క్రమంలో ఇందులో కొన్ని మార్పులు చేస్తూ ప్రభుత్వం ఖచ్చితంగా ఆ సర్వేనంబర్ వరకు వెళ్లినప్పుడు మాత్రమే వివరాలు కనిపించేలా మాడ్యుల్‌ను రూపొందించింది. ఉదాహరణకు.. ఒక ఏఈవో ఒక సర్వే నంబర్‌కు వెళ్లాల్సి వచ్చినప్పుడు గూగుల్‌లో జియోఫెన్స్ ద్వారా ఆ లొకేషన్‌కు చేరుకోవచ్చు. 50 మీటర్ల దూరంలో ఉన్నప్పుడు ఆ సర్వే నంబర్ వివరాలు ట్యాబ్‌లోని యాప్‌లో కనిపిస్తాయి. అప్పుడే పంట నమోదు వివరాలు నమోదు చేయవచ్చు. అలా కాకుండా ఎక్కడో ఉండి వివరాలు నమోదు చేద్దామంటే ఇకపై కుదరదు.

కచ్చితత్వం కోసమే..



క్రాప్ బుకింగ్ ఖచ్చితత్వం కోసమే కొత్త యాప్‌ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తుంది. ప్రధానంగా పంట నమోదు సరైన స్థాయిలో జరిగితే దిగుబడి ఎంత వస్తుందనేది ఒక అంచనా ఉంటుంది. ఆ లెక్కన ప్రభుత్వం పంటల కొనుగోలు, ఇతరత్రా అంశాల్లో ఆ వివరాలు ఉపయోగపడతాయి. ఈ దిశగా చర్యలు జరుగుతున్నాయి.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

లేజర్‌కాంతుల నడుమ కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ



భీం ఆశయసాధనకు కృషి

- ఎమ్మెల్యే జోగు రామన్న
- అట్టహాసంగా కుమురంభీం విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న, పక్కన కలెక్టర్, ఆదివాసీ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: కుమురంభీం ఆశయ సాధనకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కుమురంభీం విగ్రహాన్ని సోమవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. లేజర్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకముందు పట్టణంలోని డైట్‌మైదానం నుంచి ఆదివాసీలు గుస్సాడీ నృత్యాలతో ర్యాలీగా బయల్దేరారు. ఎమ్మెల్యే వారితో పాటు కుమురంభీంచౌక్‌కు చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాటాలు చేసిన కుమురంభీంను ఆదర్శంగా తీసుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు జోడేఘాట్‌లో భీం వేడుకలకు ఆంక్షలు ఉండేవని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక వేడుకలను అధికారికంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. అలాగే ఆదివాసీలు దీపావళి సందర్భంగా జరుపుకునే గుస్సాడీకి ప్రభుత్వం రూ. 10వేల నగదు పురస్కారం అందజేసి గుర్తింపు ఇస్తుందని చెప్పారు. గత ప్రభుత్వాలు వారి పార్టీ కార్యకర్తలకే పట్టాలు అందజేశారని, తమ ప్రభుత్వం మాత్రం అర్హులైన ప్రతీఒక్కరికి పట్టాలు అందజేస్తుందన్నారు. అందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లాలో 31వేల మందికి పోడు హక్కు పత్రాలను పంపిణీ చేసిందన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ, కుమురంభీం ఆశయ సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే గూడేలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. పోడు హక్కు పత్రాలు రాని వారికి తిరిగి సర్వే చేసి అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ ఎంపీ గొడం నగేష్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు, కుమురంభీం మనుమడు కుమ్ర సోనేరావు, అదనపు కలెక్టర్ నటరాజ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, జెడ్పీటీసీలు కుమ్ర సుధాకర్, ఏఎంసీ చైర్మన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, తాటిపెల్లి రాజు, వైస్ ఎంపీపీ కుమ్ర జంగు, మాజీ జెడ్పీటీసీ మడావి రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



వెలుగు జిలుగుల్లో కుమురంభీం చౌక్

వినతుల వెల్లువ

- 'గ్రీవెన్స్'కు తరలివచ్చిన జనం
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కై లాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణికి ఈ వారం వినతులు వెల్లువెత్తాయి. భూ సంబంధ, పింఛన్, ఉపాధి కల్పన, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మిషన్ భగీరథ, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, రేషన్ కార్డులు వంటి సమస్యలను నివేదించేందుకు జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు భారీగా తరలివచ్చారు. దీంతో సమావేశ మందిరం మధ్యాహ్నం 2గంటల వరకు కిటకిటలాడింది. వారి నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్ అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నటరాజ్, జెడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో రమేశ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్య పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ వినతి

నార్నూర్: మండలంలోని తాడిహత్నూర్ శివారులో ఉన్న సర్వే నంబర్ 30 భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను గ్రీవెన్స్‌లో గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశముందని వాటి నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. బోరు బావుల ప్లాట్‌ఫాం, వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్, యాంటీ లార్వా మందులను స్ప్రే చేయాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జనను నియంత్రించాలన్నారు. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారికి నివారణ మాత్రలు వేయాలన్నారు. మహిళా శిశు సంక్షేమం, విద్య, వైద్య శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, ఆర్డీవో రాథోడ్ రమేశ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జెడ్పీ సీఈవో గణపతి, మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆందోళనలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ఆందోళనకారులు రహదారిపై బైఠాయించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీల నిరసన



సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలనే డిమాండ్లతో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బ్లాక్ డే పాటించడంలో భాగంగా నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. ముందుగా పట్టణంలో 10కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ప్రధాన ద్వారా ఎదుట బైఠాయించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల ఆందోళన



పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె నాల్గో రోజుకు చేరింది. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు రాములు, మధ్యాహ్న భోజన కార్మికులు వినోద, సుజాత, రాంబాయి, పుష్ప, నాగమణి, కవిత తదితరులున్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో..

భీంపూర్ మండలం పాటగూడ, రాజీవ్‌నగర్ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు లంక రాఘవులు డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల ఆది వాసీలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పాటగూడకు రోడ్డు సౌకర్యం, రాజీవ్‌నగర్ వాసులకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



భిక్షాటన చేసిన స్వీపర్లు..



ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే స్వీపర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ ఆరోపించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ స్వీపర్లు కలెక్టరేట్ ఎదుట భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కనీస వేతనంతో పాటు 60ఏళ్లు దాటిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆగని దివ్యాంగుల ఆందోళన

తమకు ప్రత్యేక కాలనీ కేటాయించాలనే డిమాండ్‌తో దివ్యాంగులు చేపట్టిన ఆందోళన కొనసాగుతుంది. నెల రోజులకు పైగా కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం సరికాదన్నారు. ఇందులో ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు ఎండీ.ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



న్యాయం కోసం తరలివచ్చిన ఇచ్చోడవాసులు..



ఇంటి స్థలాల కోసం గత ప్రభుత్వం ఇచ్చిన 24 ఎకరాల భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం దుర్మార్గంగా గుంజుకుందని ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భీమన్నగుట్ట ప్రాంతంలోని సర్వేనంబర్ 46లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 24 ఎకరాల భూమిని 800 మంది ఎస్సీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిందన్నారు. అప్పటి తహసీల్దార్ లబ్ధిదారులకు కేటాయిస్తూ జీవో కూడా జారీ చేశారన్నారు. ఆ స్థలాన్ని తాజాగా పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డుతో పాటు పక్క గ్రామ పంచాయతీ పరిధిలోని వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ నిర్ణయించడం సరికాదన్నారు. ఆ స్థలాన్ని తిరిగి తమకు కేటాయించి న్యాయం చేయాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ: గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి రోడ్లు లేక గ్రామీణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, మంజూరైన రోడ్లకు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు బషీర్, విఠల్ పటేల్, చెండే బాలాజీ ఉన్నారు.

ఆలయాల్లో చోరీ

పెంబి: మండలంలోని పోచంపల్లి, పోచంపాడు గ్రామాల్లో ఉన్న జగదాంబ దేవి ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయ తాళం పగులగొట్టి అమ్మవారి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. బంగారం విలువ రూ.12వేలు, వెండి విలువ రూ.6వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలుశిక్ష

సోన్: మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద ఇటీవల మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు మూడు రోజుల జైలుశిక్ష విధించింది. ఇటీవల గంజాల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీలో కడెం మండలానికి చెందిన బసుకుంట రాజు మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అతనికి మూడు రోజులు జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి కారణమైన లారీ పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీని పట్టుకున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద ఆటోను వెనుకనుంచి ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందారు. రెండు రోజులుగా సీసీ కెమెరాల ద్వారా క్షుణ్నంగా పరిశీలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో పట్టుకున్నారు. జిల్లా పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం వెల్లడించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ఆవులు తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ పట్టణంలోని స్లాటర్ హౌస్ (కబేళ)కు ఆవులు తరలిస్తున్న ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. బేల మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆరు ఆవులను స్లాటర్ హౌజ్‌కు తరలిస్తుండగా యాపల్‌గూడ ప్రాంతంలో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు.

గుడుంబా పట్టివేత

బోథ్: మండలంలోని ధన్నూర్ (బి)లో సోమవారం గుడుంబా విక్రయిస్తూ ఓ మహిళ పట్టుబడినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా పవార్ కమల అనే మహిళ గుడుంబా విక్రయిస్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభంజనం ఆపుదాం..

- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం





'దేవుడా ఓ మంచి దేవుడా.. మాకు తినడానికి తిండినిచ్చావు.. ఇలాగే దేశంలోని తొంబై కోట్ల మందికి ఇవ్వాలి.. ప్రపంచంలోని.. నాకు నంబర్ సరిగ్గా తెలియదు.. ఎంత ఉంటే అంత మందికి ఇలాగే ఇవ్వాలని కోరుకుంటున్నా'.. అని ఓ సినిమాలో హీరో ప్రార్థిస్తాడు. అది హాస్యాన్ని పంచినా మరి నేడు అందరికీ ఆహారం అందించడం, అందరి అవసరాలు తీర్చడం, అందరికీ ఉపాధి కల్పించడం సాధ్యమవుతుందా? అంటే ఆలోచించాల్సిందే. నానాటికి పెరుగుతున్న జనాభా.. తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1987లో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకున్న రోజు జూలై 11. కాబట్టి ఆరోజును 'ప్రపంచ జనాభా దినం'గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది.

- తగ్గితేనే నీరా'జనం'...
- మితిమీరితే అనర్థమే...
- వనరుల కొరతకు మూలం...
- రోజురోజుకూ పెరుగుతున్న జనాభా

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం జనాభా	జిల్లా వైశాల్యం (చ.కి.మీ.లు)	జనసాంద్రత (కి.మీ.కు)
నిర్మల్	7,09,418	3,731.35	190
ఆదిలాబాద్	7,08,972	3,971.31	179
మంచిర్యాల	8,07,037	3,908.04	207
కుమురంభీం	5,15,812	4,491.28	115

నిర్మల్ ఖిల్లా: 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వనరులు తరిగిపోతున్నా వాటిని పొదుపుగా వాడుకునేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. కాబట్టి ప్రకృతి వనరుల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేయాలి. అలాగే.. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, నిరక్షరాస్యత, భూమిపై స్థలం సరిపోకపోవడం.. లాంటి సమస్యలను ప్రభుత్వాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపర్చాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్నంగా అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భారాన్ని కాస్తయినా తగ్గించినవారం అవుతాం.

మితిమీరితే ఏర్పడే సమస్యలు ఇవే

జనాభా పెరుగులతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది. అడవులు అంతరించిపోతాయి. జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా తీర్చాలి. దీంతో తరాల మధ్య అంతరాలు పెరుగుతాయి. ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బందులు పెడతాయి. జనాభా పెరుగుదలను అడ్డుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే సమస్యలే నిత్యం స్వాగతం చెబుతాయి. వనరులు సైతం తరిగిపోతున్నాయి. అవసరాలకు మించి వాడటంతో సమస్యలే ఎదురవుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చైనాను దాటేసిన భారత్....

ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ నిలిచింది. చాలా కాలంగా మొదటి స్థానంలో కొనసాగుతున్న చైనాను అధిగమించింది. అయితే ఈ రెండు దేశాల మధ్య అంతరాయం చాలా తక్కువే కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన ఐక్యరాజ్య సమితి అంచనా నివేదిక ప్రకారం చైనాలో 142.5 కోట్ల జనాభా ఉంటే భారతదేశంలో ప్రస్తుతం 142.8 కోట్ల జనాభా ఉంది. అంటే చైనా కంటే ఇండియా జనాభా దాదాపు మూడు మిలియన్లు ఎక్కువ. భూభాగం పరంగా చైనా పరిధి విశాలంగా ఉండగా భారతదేశం పరిధి చైనాకంటే తక్కువగా ఉంది.

నియంత్రిస్తేనే మనుగడ



పరిమిత వనరులున్న భారతదేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.

– పీజీ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

సమస్యలు పరిష్కరించాలని వినతి



సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: నియోజవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదివారం హైదరాబాద్‌లో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ క్రిష్టియాన చొంగ్తూ, పంచాయతీ రాజ్ చీఫ్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాలను కలిశారు. పెంబి మండలంలోని పస్పుల వంతెన నిర్మాణం, కడెం మండలంలోని గంగాపూర్ వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని, ట్రైబల్ వెల్ఫేర్ నుండి మంజూరైన రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

చెత్త సేకరణలో సర్పంచ్, ఉప సర్పంచ్



చెత్త సేకరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

ఉట్నూర్‌రూరల్: తమ డిమాండ్లు నెరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టగా చేసేదేంలేక సోమవారం సర్పంచ్, ఉప సర్పంచ్ కార్మికులుగా మారారు. మండలంలోని శ్యాంపూర్‌లోని కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఉపసర్పంచ్ కేశవ్ ట్రాక్టర్ నడుపుతుండగా సర్పంచ్ మల్లిక ఇంటింట చెత్త సేకరించారు.

నేడు అభ్యర్థులకు కౌన్సెలింగ్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గుర్తించిన పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిన పనిచేయడానికి 2019 నవంబర్ 6న నిర్వహించిన రాతపరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 11న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, డాటాఎంట్రీ ఆపరేటర్లు, సిస్టమ్ ఎనాలిస్టు, అసిస్టెంట్ ప్రోగామర్ పోస్టులు భర్తీకి తుది జాబితాను బోర్డుపై ప్రదర్శించినట్లు తెలిపారు.

తుడుందెబ్బ కమిటీల్లో మార్పులు



మాట్లాడుతున్న కొడప నగేష్

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా కమిటీల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు జల్కే పాండురంగ్, కార్యదర్శి కొడప నగేష్, ఉపాధ్యక్షుడు దుర్వ నగేష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా బుర్స పోచ్చయ్య, మైపతి అరుణ్‌కుమార్, గోడం గణేశ్, పుర్క బాపురావ్ తుడుందెబ్బ ప్రతిపాదిత ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇకపై వారికి తుడుందెబ్బ కమిటీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇదే విషయంపై ఈ నెల 23న హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం కానున్నట్లు తెలిపారు. సమావేశంలో కొలాం సేవా సంఘం నాయకుడు కొడప సోనేరావ్, తుడుందెబ్బ నాయకులు సిడాం పురుషోత్తం, సిడాం లక్ష్మీకాంత్, గోండ్వానా గణతంత్ర పార్టీ జిల్లా అధ్యక్షుడు తుంరం చందన్ షావ్, వెట్టి దేవిదాస్, సెడ్మకి ఆనంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో నిర్మల్ న్యాయస్థానం ఒకరికి ఐదేళ్ల జైలు, జరిమానా విధించినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. భైంసాకు చెందిన పల్సి సునీల్, పల్సి రజినీకాంత్ అన్నదమ్ముల కుమారులు. ఇద్దరి మధ్య భూతగాదాలు ఉన్నాయి. 15 అక్టోబర్ 2021న సునీల్ తన ఇంటిముందు నిలబడి ఉండగా రజినీకాంత్ వచ్చి భూతులు తిట్టాడు. రాయితో కొట్టడంతో గాయాలయ్యాయి. దీంతో బాధితుడు భైంసా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సైలు ప్రదీప్, విక్రమ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు చేయడంతో రజినీకాంత్‌కు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు, రూ.2,200 జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.అజేశ్ కుమార్ సోమవారం తీర్పునిచ్చారు.

దాడి కేసులో వ్యక్తి రిమాండ్

కుభీర్(ముధోల్): మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన పోతుగంటి శివకుమార్‌పై ఇటీవల నిగ్వా బస్టాండ్ వద్ద కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన తపస్కర్ రవిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. బాధితుని తల్లి పోతుగంటి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి భైంసా మున్సిఫ్ జడ్జి రవిబాబు ఎదుట హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని పురాణ బజార్‌లో గల ఓ కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న రాత్రి గుర్తు తెలియని దుండగులు దుకాణంలోకి ప్రవేశించి రూ.40వేలు అపహరించినట్లు పాంగ్రిగల్లికి చెందిన అబ్దుల్ ఇర్ఫాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపగా సీసీ పుటేజీల ఆధారంగా పాంగ్రిగల్లికి చెందిన షేక్ అద్నాన్, సయ్యద్ సోహెబ్, షేక్ మెగ్రాజ్, సయ్యద్ సల్మాన్, షేక్ సల్మాన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.38,600 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య



రుక్మాబాయి(ఫైల్)

లోకేశ్వరం(ముధోల్): భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన మిర్యాల రుక్మాబాయి (45) భర్త మిర్యాల సుదర్శన్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన మహిళ ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు టేకు గంగారాం ఫిర్యాదు మేరకు సుదర్శన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ...

నేరడిగొండ(బోథ్): ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడూర్‌కు చెందిన బొడిగ గంగయ్య (36) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం రూ.6లక్షల వరకు అప్పులపాలయ్యాడు. దీంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక తరచూ భార్య చినలక్ష్మితో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ నెల 4 న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం సాయంత్రం బోథ్ ఎక్స్‌రోడ్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సాయన్న సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి ఒకరు..

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్‌కు చెందిన ఇంగం శ్రీనివాస్ (40) మెడికల్ ఏజెన్సీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఫోన్ కాల్ ఆధారంగా లాడ్జీలోకి వెళ్లి పరిశీలించగా పురుగుల మందు తాగి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య మీన, కుమారుడు మల్లిక్ సాయి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్



సమస్య వింటున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. కెరమెరి మండలం రాంపూర్‌కు చెందిన కోట్నాక్ విజయ్ దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని, తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండలం న్యూసోమర్‌పేట్ గ్రామస్తులు, దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన భుక్యా వంశీ తనకు స్వయం ఉపాధికోసం ఆర్థికసాయం అందించాలని, ఆర్‌వోఎఫ్ఆర్ హక్కు పత్రాలు మంజూరు చేయాలని నెన్నెల మండలం దమ్మిరెడ్డి గ్రామస్తులు కోరారు. ఇవేకాకుండా ఇంకా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలు స్వీకరించిన పీవో సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుడ్మ బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి పోస్టర్ తయారీ పోటీలు

నిర్మల్ రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు జిల్లా స్థాయి పోస్టర్ తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఇందులో పాల్గొనాలి సూచించారు. మండలానికి ముగ్గురు చొప్పున పాల్గొని, అధికారులు ఇచ్చిన అంశంపై పోస్టర్లు తయారు చేయాలని తెలిపారు. పోటీల అనంతరం విజేతలను ప్రకటిస్తామని, మొదటి బహుమతిగా రూ.500 రెండో బహుమతిగా రూ.300 మూడో బహుమతిగా రూ.200 అందజేస్తామన్నారు. పోస్టర్ తయారీకి సంబంధించిన సామాగ్రి విద్యార్థులే తెచ్చుకోవాలని సూచించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



గాయాలపాలైన భీమయ్య

పెంబి: మండల కేంద్రానికి చెందిన భీమయ్య, ఎల్లయ్య సోమవారం పెంబి నుంచి పెంబితాండలో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరారు. పెంబితాండ సమీపంలో సైకిల్‌ను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఇద్దరికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా

- ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి



లక్ష్మీపూర్ చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ

తలమడుగు(బోథ్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, లక్ష్మీపూర్ సమీపంలోని చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో సంచరించే వాహనాలను సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం తలమడుగు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ, సైదారావు, తలమడుగు ఎస్సై జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డీఈఓ ప్రణీత

ఆదిలాబాద్: క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందితే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను డీఈవో ప్రణీతతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన చిన్నారులు హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. అక్కడ ప్రతిభ కనబరిచిన వారికి క్రీడా పాఠశాలలో ప్రవేశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ స్వామి, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి రాజేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు హరిచరణ్, నాందేవ్, అశ్వత్ రెడ్డి జయశ్రీ, కబీర్దాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో యువకుడి సత్తా



రజత పతకం అందుకుంటున్న సంజీవ్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన రాసకొండ సంజీవ్ జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 1 నుంచి 5వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో వాకో ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్స్, మాస్టర్స్ కిక్ బాక్సింగ్ చాంపియంయన్ షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. 67 కిలోల విభాగం పోటీల్లో సత్తా చాటి రజత పతకాన్ని అందుకున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమగా రాణించిన సంజీవ్‌ను తెలంగాణ కిక్ బాక్సింగ్ క్రీడాకారులు, గ్రామస్తులు అభినందించారు.